భూసేకరణ పనులను వేగవంతం చేయాలి

- నిర్వాసితులకు ఇంటి స్థలాలు అందించాలి
- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 21 : కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు కోసం భూ సేకరణ పనులను వేగవంతం చేయాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కేటీపీపీ పరిశ్రమకు బొగ్గు రవాణా కన్వేయర్ బెల్ట్ ఏర్పాటుకు భూసేకరణ, దుబ్బపల్లి గ్రామానికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, కేటీపీపీ భూముల సరిహద్దుల ఏర్పాటు, తాడిచర్ల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ తదితర అంశాలపై జెన్‌కో, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాడిచర్ల నుంచి గణపురం మండలంలోని చెల్పూరు కేటీపీపీకి 17 కిలోమీటర్ల కన్వేయర్ బెల్ట్ ఏర్పాటుకు 133 ఎకరాల భూమి సేకరించాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు సుమారు 14 కిలోమీటర్ల భూసేకరణ జరిగిందని, భూ నిర్వాసితులకు పరిహారం అందించామని తెలిపారు. మిగిలిన 3.5 కిలోమీటర్లు సీపల్లి, కొంపెల్లి గ్రామాల మీదుగా కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేయాల్సి ఉన్నందున నిర్వాసితులతో మాట్లాడి భూసేకరణ చేపట్టాలని ఆదేశించారు. కాకతీయ లాంగ్ వాల్ ప్రాజెక్ట్ నుంచి కేటీపీపీ వరకు ఏర్పాటు చేయనున్న మరో కన్వేయర్ బెల్ట్ కోసం సేకరించిన భూమి ఆక్రమణకు గురి కాకుండా సర్వే నిర్వహించి సరిహద్దులను ఏర్పాటు చేయాలన్నారు. బ్యాలెన్స్ అసైన్డ్ భూములకు ఎంజాయ్‌మెంట్ సర్వే చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కేటీపీపీ నిర్మాణంలో భూములు కోల్పోయిన దుబ్బపల్లి గ్రామాన్ని ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద తరలించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని, ఈ ప్యాకేజీ కింద తాడిచర్ల భూనిర్వాసితులకు ఇంటి స్థలాలు అందించడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవో మంగిలాల్, కేటీపీపీ సీఈ సిద్ధయ్య, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పోషణ మాసం పోస్టర్ల ఆవిష్కరణ

పోషణ మాసం కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. ఐడీవోసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సీడీపీవోలు, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, హెల్త్ సబ్ సెంటర్ల వైద్యులు, గ్రామీణ అభివృద్ధి శాఖ, విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ నెల మొత్తం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పౌష్టికాహార లోపం ఉన్న చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంబంధించిన నివేదికను అందించాలని ఆదేశించారు. పాఠశాలలో రక్తహీనత, ఆరోగ్య సమస్యలున్న విద్యార్థులను గుర్తించి, వైద్యులకు సమాచారం అందించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. అనంతరం పోషణ మాసం పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్సీపీఆర్ మెంబర్ శోభారాణి, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో మెరుగైన విద్య అందించాలి : కలెక్టర్

అటానమీ, మ్యూజియాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

భూపాలపల్లి రూరల్/గణపురం : వైద్య కళాశాలలో మెరుగైన విద్య అందించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అటానమీ, మ్యూజియం, మొదటి, రెండో సంవత్సరం లెక్చరర్స్ గ్యాలరీ, హెచ్‌ఆర్ రూమ్ లను పరిశీలించి, వైద్య కళాశాల అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ రెండో సంవత్సరం విద్యార్థుల కోసం రామప్ప కాలనీలో సింగరేణి అధికారులతో మాట్లాడి రెండు బ్లాకులను కేటాయించాలని, జిల్లా దవాఖాన నుంచి మెడికల్ కళాశాలకు ప్రయాణించడానికి రెండు బస్సులు, మెడికల్ కళాశాల ఆవరణలో రెండు బోర్‌వెల్స్, సోలార్ విద్యుత్ ఏర్పాటు చేయాలని, వైద్య కళాశాలలో పొరుగు సేవల సిబ్బంది నియామకం కోసం అనుమతి ఇవ్వాలని కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించి సింగరేణి అధికారులతో మాట్లాడి 100 మంది విద్యార్థులకు వసతి ఉండేలా మూడు బ్లాకులను కేటాయిస్తామని తెలిపారు. రెండో సంవత్సరం విద్యార్థులకు విద్యా బోధన కోసం సెకండ్ లెక్చరర్ హాల్ నిర్మాణానికి నిధులు విడుదల చేస్తామన్నారు. మెడికల్ కళాశాలలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం నర్సింగ్ కళాశాల ఏర్పాటు కోసం నూతనంగా నిర్మిస్తున్న ఆయుష్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ శశికాంత, డాక్టర్ వందన, డాక్టర్ రాజేశం, సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారుల ప్రగతికి కృషి చేయాలి

ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగురూరల్, సెప్టెంబర్21 : ఇందిరా మహిళా శక్తి లబ్ధిదారులు ప్రగతి సాధించేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో డీఆర్డీఏ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు తగిన ఉపాధి చూసేందుకు జిల్లాలో 9 మదర్ యూనిట్లు, 1,125 పెరటి కోళ్ల పెంపకం యూనిట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మదర్ యూనిట్ విలువ రూ.2.91లక్ష కాగా, పెరటి కోళ్ల యూనిట్ విలువ రూ.15వేలు ఉందని తెలిపారు. బ్యాంకు లింకేజీ కింద రుణాలను మంజూరు చేసి, 100శాతం రికవరీ చేయాలని సీసీలను ఆదేశించారు. మహిళా శక్తి కార్యక్రమంలో ములుగు జిల్లా ముందుండేలా అధికారులు చూడాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఏపీఆర్‌డీ బాలస్వామి, పశువైద్యాధికారి కొమురయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక

ప్రజా వేదికలో పాల్గొన్న డీఆర్డీవో అవినాష్

రేగొండ, సెప్టెంబర్ 21 : మండల కేంద్రంలో 15వ విడుత ఉపాధి హామీ పనులపై శనివారం ప్రజావేదికను నిర్వహించినట్లు డీఆర్డీవో అవినాష్ తెలిపారు. ఉపాధి హామీ పథకంలో ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు జరిగిన 708 పనులపై సామాజిక తనిఖీ టీమ్ తనిఖీలు చేయగా అభ్యంతరాలపై ప్రజావేదిక నిర్వహించారు. గ్రామాల్లో అవినీతికి పాల్పడిన వారి నుంచి డబ్బులు రికవరీకి ఆదేశించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ ఉపాధిహామీ పనులకు జవాబుదారీగా ప్రజా వేదికలు ఉపయోగపడతాయన్నారు. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. క్వాలిటీ కంట్రోల్ అధికారి ధన్‌సింగ్, విజిలెన్స్ అధికారి రుబినా బేగం, అంబుడిమెన్ శ్రీనివాస్, ఎంపీడీవో జీ రాంప్రసాద్‌రావు, ఏపీవో జమీర్ పాషా, ఈసీ మధుకర్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఎస్ఆర్పీ కొమరయ్య, డీఆర్పీ రమేశ్, రాజు, సంధ్యారాణి పాల్గొన్నారు.

జిల్లాలో 17.4 మి.మీ. వర్షపాతం

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 21: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో శనివారం ఉదయం 8.30 గంటల వరకు 17.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని మహాముత్తారం మండలంలో 24.6 మి.మీ, మహాదేవ్‌పూర్‌లో 44.8, కాటారంలో 13.8, మల్హర్‌రావులో 4.2, టేకుమట్లలో 1.4, మొగుళ్లపల్లిలో 3.4, చిట్యాలలో 2.8, రేగొండలో 49.4, పలిమెలలో 2.2, భూపాలపల్లిలో 14.6, గణపురం మండలంలో 30.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

క్రీడా పాలసీకి దరఖాస్తు చేసుకోవాలి

ములుగురూరల్, సెప్టెంబర్ 21 : తెలంగాణ క్రీడా పాలసీకి వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల అధికారి తుల రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు వారు పొందిన సర్టిఫికెట్లను జత చేస్తూ ఈ నెల 23లోగా జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. వివరాలకు 9849011113ను సంప్రదించాలన్నారు.

జాతీయ పోటీలకు గురుకుల విద్యార్థి

ములుగురూరల్, సెప్టెంబర్21 : జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలకు జాకారం సాంఘిక సంక్షేమ బాలుర గురుకులానికి చెందిన విద్యార్థి గోగు సాయితేజ ఎంపికయ్యాడు. ఈ మేరకు శనివారం సాయితేజను ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సురేశ్‌బాబు, పిచ్చిరెడ్డి, రాంరెడ్డి, యాదగిరి, సదయ్య అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 16 వరకు నిర్మల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన సాయితేజ జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. 30 నుంచి అక్టోబర్ 2 వరకు పంజాబ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటాడని వివరించారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

ములుగురూరల్, సెప్టెంబర్ 21 : ఖమ్మం వరద బాధితులకు సాయం చేసేందుకు ములుగు జిల్లా నిరుద్యోగ కళాకారులు విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మోతె రమేశ్ మాట్లాడుతూ ములుగులోని చిరు వ్యాపారులతోపాటు పలు దుకాణదారులు విరాళాలు అందించారని తెలిపారు. డాక్టర్ పోరిక రవీందర్‌నాయక్, కళాకారులు గోల్కొండ బుచ్చన్న, రాగుల శంకర్, పోలె పాక యాకయ్య, బొచ్చు సాంబయ్య, బత్తుల ఉపేందర్, ఇనుముల మల్లయ్య, దూడపాక రాజేందర్, కంచం భద్రి, పత్తిపల్లి రాజేందర్, మోతె రవీందర్, నేదూరి ప్రవంతి, వంక సరిత పాల్గొన్నారు.

'పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి'

ఏటూరునాగారం, సెప్టెంబర్ 21 : మండల కేంద్రంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు సోడి అశోక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రిన్సిపాల్ పట్టించుకోకపోవడం వల్ల వారు బయట తిరుగుతున్నారని ఆరోపించారు. విద్యార్థులకు ఏదైనా జరిగితే ప్రిన్సిపాలే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

ఏటూరునాగారం, సెప్టెంబర్ 21 : మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో పోలీసులు శనివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలను తనిఖీ చేశారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించారు. సరిహద్దు ప్రాంతాలు, కూడళ్లలో తనిఖీలు చేసి, ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లు ఎస్సై తాజుద్దీన్ తెలిపారు.

లైంగికదాడులు, అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన

గణపురం, సెప్టెంబర్ 21 : ఆడపిల్లలపై లైంగికదాడులు, అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన కల్పించారు. కైలాశ్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్, సహాయ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్జీఏ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయం, మోడల్ పాఠశాలల్లో అవగాహన కల్పించారు. మండల సోషల్ కార్యకర్తలు ఇనుగాల అశోక్, బలుగూరి వెన్నెల సిలువేరు కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టేకు కలప స్వాధీనం

ఏటూరునాగారం/తాడ్వాయి, సెప్టెంబర్ 21 : ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఓడవాడ కరకట్ట సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన రూ.3లక్షల విలువ చేసే 12 టేకు దుంగలను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు రేంజ్ ఆఫీసర్ అబ్దుల్ రహమాన్ తెలిపారు. టేకు దుంగలను స్వాధీనం చేసుకుని టింబర్ డిపోకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. అలాగే, తాడ్వాయి మండలంలోని కొడిశాల అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా బొలెరోలో తరలిస్తున్న రూ.2.30లక్షల విలువైన టేకు దుంగలను శనివారం రాత్రి పట్టుకున్నారు. వాహనంతోపాటు స్మగ్లర్ రవిని అదుపులోకి తీసుకున్నట్లు రేంజ్ అధికారి కోట సత్తయ్య తెలిపారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

మంగపేట, సెప్టెంబర్ 21 : కోమటిపల్లిలో శనివారం ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ తీగకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై ననుమోల సోమయ్యకు చెందిన రెండు గొర్రెలు మృతి చెందాయి. తనను ఆదుకోవాలని సోమయ్య విద్యుత్ అధికారులకు విజ్ఞప్తి చేశాడు.

బైక్‌పై నుంచి పడి ఇద్దరికి గాయాలు

వాజేడు, సెప్టెంబర్ 21 : జంగాలపల్లి గ్రామానికి చెందిన రాంబాబు ఏటూరునాగారం మండలం రొయ్యూర్ గ్రామానికి చెందిన నీలాద్రితో కలిసి శనివారం మధ్యాహ్నం బైక్‌పై కడెకల్ వెళ్లి వస్తున్నాడు. మార్గమధ్యంలోని ఎర్రబొర్రు సమీపంలో జాతీయ రహదారిపై అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. 108 సాయంతో పీహెచ్‌సీకి తీసుకెళ్లగా వైద్యాధికారి మధుకర్, స్టాఫ్ నర్సు మానస చికిత్స అందించారు.

విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలి

ఏఎంవో లక్ష్మణ్ నాయక్

మాట్లాడుతున్న ఏఎంవో లక్ష్మణ్‌నాయక్

గణపురం/మహదేవపూర్, సెప్టెంబర్ 21 : విద్యార్థుల విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఏఎంవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం చెల్పూర్ జడ్పీఎస్ఎస్‌లో హెచ్ఎం కొలువుల అశోక్ అధ్యక్షతన జరిగిన తల్లిదండ్రులు, టీచర్ల సమావేశానికి సామల రమేశ్‌తో కలిసి లక్ష్మణ్‌నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థుల ప్రగతిపై విలువైన సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. అలాగే, మహదేవపూర్ మండల కేంద్రంలో బాలికల, బాలుర ఉన్నత పాఠశాల్లో హెచ్ఎంలు సరిత, బండం రాజిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల ప్రగతి పత్రాలు అందజేశారు. ఏఏపీసీ చైర్‌పర్సన్ స్వరాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు మడక మధు, ప్రభాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, సమ్మయ్య, సుధారాణి, రజిత, వీరేశం, దేవి, లీలారాణి, ఫర్జానా పాల్గొన్నారు.

కాల్వపల్లి డంప్‌లో మందుగుండు సామగ్రి ?

- కూపీ లాగుతున్న పోలీసులు
- క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీ

డంప్ బయటపడ్డ స్థలంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

తాడ్వాయి, సెప్టెంబర్ 21 : మండలంలోని కాల్వపల్లి శివారులో ఈ నెల 17న వెలుగు చూసిన మావోల డంప్‌లో మందుగుండు సామగ్రి లభ్యమైనట్లు జోరుగా ప్రచారం సాగుతున్నది. ఓ రైతు పోడు భూమిలో ట్రాక్టర్‌తో దున్నుతుండగా ఇనుప డంపు కల్టివేటర్‌కు తగిలి బయటకు వచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఈ డంపు బయటపడగానే అందులో నుంచి పొగలు రావడంతో భూమి యజమాని, డ్రైవర్ అక్కడి నుంచి గ్రామంలోకి వచ్చినట్లు సమాచారం. మరో వ్యక్తి డంప్ దొరికిందని, అందులో పెద్ద మొత్తంలో నగదు ఉందని, యజమాని తీసుకున్నాడని చెప్పడంతో మండలంలో జోరుగా చర్చలు సాగుతున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహించి, సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. మూడు రోజులుగా విచారణ సాగుతున్నా ఎలాంటి సమాచారం లభించలేదు.

డంప్‌లో ఏమీ లేదని పోలీసులు చెబుతున్నట్లు సమాచారం. ఈ విషయమై ఎలాంటి ప్రకటన చేయలే దు. కాగా, అదేరోజు రాత్రి సదరు ట్రాక్టర్ డ్రైవర్ డంప్‌లో నుంచి 3జిలిటిన్ స్టిక్స్ ప్యాకెట్లను గ్రామంలోకి తీసుకువచ్చి, భయపడి గ్రామ శివారులో పడేసినట్లు ప్రచారం సాగుతున్నది. ఈ విషయం పోలీసులకు తెలుపగా వారు వాటిని స్వాధీనం చేసుకున్నట్లు గ్రామంలో చర్చించుకుంటున్నారు.

గుమ్మడిదొడ్డిలో ముగ్గుల పోటీలు

వాజేడు : బహుమతులు అందజేస్తున్న కార్యదర్శి అశోక్

వాజేడు, సెప్టెంబర్ 21 : స్వచ్ఛ హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో శనివారం పంచాయతీ కార్యదర్శి చిచ్చాడి అశోక్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, కుర్చీల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వెలుగు సీసీ పోడపాటి సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

మల్హర్ : మండలంలోని తాడిచెర్ల జూనియర్ కళాశాలలో ఎంపీడీవో శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి ఆర్ చాందిని, కీర్తి, హర్షిత, అమూల్య, టీ పుష్ప గెల్చుకోగా, రెండో బహుమతి చందన, అభినయ, అనూష, సాయి మాళవిక, కావ్యశ్రీ గెలుచుకున్నారు. వీరికి ప్రిన్సిపాల్ ఎం విజయాదేవి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యదర్శి చెల్కల రాజు యాదవ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రవీందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై విద్యార్థులకు అవగాహన

ములుగురూరల్, సెప్టెంబర్ 21 : ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థులకు శనివారం నో బ్యాగ్‌డే సందర్భంగా ములుగులోని యూనియన్ బ్యాంకులో బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు బ్యాంకు డిప్యూటీ మేనేజర్ రంజిత్ ఖాతాలు, అప్పుల వివరాలు, లాకర్ సౌకర్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజేందర్, ఉపాధ్యాయులు మల్లయ్య, సతీశ్‌కుమార్, జాఫర్‌అలీ, మదన్‌మోహన్, హమీద్, బ్యాంకు మేనేజర్ రజినీకాంత్, సిబ్బంది రాజునాయక్, దినేశ్ రాజ్, గోపాల్, ప్రశాంత్ పాల్గొన్నారు.

వాజేడులో గ్యాస్ వినియోగంపై..

వాజేడు : మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నో బ్యాగ్‌డే సందర్భంగా విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులందరూ స్థానిక భారత్ గ్యాస్ గోదామును సందర్శించారు. క్షేత్ర పర్యటనలో విద్యార్థులకు గ్యాస్ వినియోగం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై భారత్ గ్యాస్ నిర్వాహకుడు కొండ్ర అభిషేక్ అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు సోయం ఆనందరావు, స్వరూప్‌సింగ్, మల్లయ్య, ప్రభాకర్, తెల్లం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

జర్నలిస్టులు సభ్యత్వం నమోదు చేసుకోవాలి

కృష్ణకాలనీ, సెప్టెంబర్ 21: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు టీయూడబ్ల్యూజే(ఐజేయూ) సభ్యత్వాన్ని తీసుకోవాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు క్యాతం సతీశ్‌కుమార్, సామంతుల శ్యామ్ యాదవ్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ సోమవారం నుంచి సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్నామని, అన్ని మండలాల్లో ఇన్‌చార్జిని నియమిస్తున్నట్లు తెలిపారు. త్వరలో హైదరాబాద్‌లో జరిగే జర్నలిస్ట్ ఆత్మీయ సమ్మేళనానికి అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. జిల్లా కోశాధికారి కుమార్ యాదవ్, రాష్ట్ర హెల్త్ కమిటీ మెంబర్ సామల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ విజయ్, టిమ్మూ అధ్యక్షుడు సాంబయ్య, చిన్న పత్రికల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కార్గో సర్వీసెస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కృష్ణ కాలనీ, సెప్టెంబర్ 21: టీజీఎస్ ఆర్టీసీ లాగ్‌స్టిక్స్ పార్శిల్ సర్వీసెస్ మార్కెటింగ్‌ను జిల్లాలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ ఏటీఎం పవన్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో టీజీఎస్ ఆర్టీపీ లాజిస్టిక్స్ కార్గో పార్సిల్ సర్వీసెస్ మార్కెటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ప్రధాన రహదారిలో కార్గో పార్సెల్ సర్వీసెస్ మార్కెటింగ్‌పై పవన్‌కుమార్ అవగాహన కల్పించారు. కార్గో ద్వారా అన్ని ప్రాంతాలకు సరసమైన ధరల్లో త్వరగా పార్శిల్స్ పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్గో సేల్స్ టీం సభ్యులు రామయ్య, నరేందర్, తిరుపతి, సతీశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

లైంగికదాడి నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ఏటూరునాగారం, సెప్టెంబర్ 21 : ఆదిలాబాద్ జిల్లా జైనూర్‌లో ఆదివాసీ మహిళపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ తుడుందెబ్బ ఆధ్వర్యంలో శనివారం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం రాష్ట్ర కో కన్వీనర్ ఆలం కిశోర్ ఆధ్వర్యంలో ఎస్సై తాజుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు పొడెం బాబు, పులిశె బాలకృష్ణ, వట్టం జనార్దన్, సారయ్య, కొర్నిబెల్లి గణేశ్, ఆదివాసీ మహిళా సంఘ అధ్యక్షురాలు బడే సులోచన, ఎమ్మార్పీఎస్ నాయకుడు వీ స్వామి, ఏటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మైపతి సంతోష్ పాల్గొన్నారు.

బతుకమ్మ ఆట స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

బతుకమ్మకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

చిట్యాల, సెప్టెంబర్ 21 : బతుకమ్మ పండుగ విజయవంతమయ్యేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, జడ్పీ సీఈవో విజయలక్ష్మి సూచించారు. శనివారం ఆమె మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి(సి)లో బతుకమ్మ ఆట స్థలాను పరిశీలించారు. అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తదితరులు ఉన్నారు.

'ఉద్యోగుల ఆశలను వమ్ము చేస్తున్న ప్రభుత్వం'

ములుగురూరల్, సెప్టెంబర్ 21 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడిచినా ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పట్టించుకోకుండా వారి ఆశలను వమ్ము చేస్తున్నదని పీఆర్టీయూ తెలంగాణ ములుగు జిల్లా అధ్యక్షుడు కొయ్యడ సురేందర్ ఆరోపించారు. రాష్ట్ర విద్యాశాఖ నుంచి విడుదలైన వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రొసీడింగ్‌పై పునఃసమీక్షించి నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. ఒక ఉపాధ్యాయుడు 60 మంది పిల్లలకు ఎలా బోధించగలడో అధికారులు ఆలోచించాలని కోరారు. అలాగే, అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ప్రతి సబ్జెక్టుకు ఒక టీచర్ ఉండాల్సిందేనని, ప్రభుత్వం దీనిపై పునరాలోచించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రకటించి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ఒక ప్రకటనలో కోరారు.

'స్థానిక రిజర్వేషన్లను మార్చాలి'

ఏటూరునాగారం, సెప్టెంబర్ 21 : జనాభా నిష్పత్తిని దృష్టిలో పెట్టుకుని స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను మార్చాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వావిలాల స్వామి కోరారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, బీసీలకు జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లు ఉండాలన్నారు. నాయకులు పడిదల సతీశ్, పరికి మహేశ్, లంజపల్లి శ్రీను, చిందు చిరంజీవి, కర్నె గోపి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

తాడ్వాయి, సెప్టెంబర్ 21 : మండలంలోని మేడారం పరిధిలోని రెడ్డిగూడెంలో అనంతుల సంపత్ వారం రోజుల క్రితం మృతిచెందగా బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు శనివారం ఆర్థికసాయం అందజేశారు. పార్టీ నియోజ